పార్టీలకు అతీతంగా పనిచేశా.. నామా

ఖమ్మం కూరగాయల మార్కెట్లో ప్రచారం చేస్తున్న నామా నాగేశ్వరరావు, నాయకులు

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 29 : నిరంతరం మీ కష్టాలను పంచుకొని, ఇంతకాలం పార్టీలు, కులమతాలకు అతీతంగా పని చేశానని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్ వద్ద గల హోల్‌సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్‌లో బీఆర్ఎస్ నేతలు తోట రామారావు, పొన్నం వెంకటేశ్వరరావుతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులు, కార్మికులు, వినియోగదారులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతు వ్యతిరేక చట్టాలకు, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు అలుపెరగని పోరాటం చేశానన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులను గట్టిగా నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మోరంపుడి ప్రసాదరావు, వ్యాపారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

నామానుగెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, ఆర్‌జేసీ కృష్ణ

కారేపల్లి, ఏప్రిల్ 29: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని వైరా నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. ప్రజలు తిరిగి మళ్లీ బీఆర్ఎస్ పరిపాలనను కోరుకుంటున్నారన్నారు. వైరా నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తీసుకువచ్చేందుకు గడప గడపను తట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, ఎంపీటీసీలు జడల వసంత, శంకర్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు, హన్మకొండ రమేష్, ఉన్నం వీరేందర్, జడల వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీనివాస్, డొంకెన రవీందర్, లకావత్ లక్ష్మణ్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లతో ఎక్కువ సమయం గడపాలి: సండ్ర

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ఓటర్లతో ఎక్కువ సమయం కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని రామచంద్రావు బంజరలో సోమవారం జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక రకాలుగా ప్రజలను ఇబ్బందులు పెడుతుందని, అలా ఇబ్బందులు పడే ప్రతిఒక్కరినీ కలిసి కారు గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నిక సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు ఎవరి గ్రామంలో వారే ఉండి ఉదయం, సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు షేక్ గౌస్, మాజీ ఏఎంసీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, మందడపు అశోక్‌కుమార్, ఎలమర్తి శ్రీను, వంగా గిరిజాపతి పాల్గొన్నారు.

విదేశీ విద్య స్టడీసెంటర్ బ్రోచర్ ఆవిష్కరణ

ఖమ్మం, ఏప్రిల్ 29 : ఖమ్మంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు చేతుల మీదుగా విదేశీ విద్యకు సంబంధించిన మై డ్రీమ్ అబ్రాడ్ స్టడీసెంటర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పేదవర్గాలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలని, ఖమ్మంలో ఇందుకు సంబంధించి స్టడీ సెంటర్ ప్రారంభించిన నిర్వాహకులను ఈ సందర్భంగా నామా అభినందించారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ యజమాని పెద్దప్రోలు మధు కుమార్, నామా భవ్యతేజ, సాయిరామ్, రావులపల్లి అవినాష్, సరిపూడి గోపీ సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా..

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు, కోలాటమాడుతున్న మహిళలు, మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

- కేసీఆర్ ఆశీర్వాదంతో పార్లమెంటరీ నేతగా ఎదిగా..
- లోక్‌సభలో తెలంగాణ బిల్లుపై మొదటి ఓటు వేశా..
- రైతుబిడ్డగా మరోసారి ఆశీర్వదించండి..
- ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 29: బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన కేసీఆర్ రోడ్ షోలో నామా మాట్లాడారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ఖమ్మం ప్రజలు రెండు సార్లు ఎంపీగా గెలిపించారని, కేసీఆర్ తనను పార్లమెంటరీ నాయకుడిగా చేశారని అన్నారు. కేసీఆర్ చేసిన పోరాటాల ఫలితంగా 15వ లోక్‌సభలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మొదటి ఓటు వేశానని నామ గుర్తు చేశారు. ఎన్నో సమస్యలపై, తెలంగాణకు రావాల్సిన నిధులు, రైతుల హక్కుల విషయంలో సైతం పార్లమెంట్‌లో మాట్లాడానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్ విషయంలో కేసీఆర్ సూచలనల మేరకు పార్లమెంట్‌లో మాట్లాడానని, కేంద్రం తెలంగాణ పట్ల చిన్న చూపు చూసిందన్నారు. కేసీఆర్ కేంద్రానికి అనేక లేఖలు రాసినా కనీసం ఒక్క నవోదయ కళాశాల కూడా ఇవ్వలేదన్నారు. కేంద్రం రాష్ట్రానికి సహకరించకున్నా కేసీఆర్ తెలంగాణ ప్రజలను, రైతాంగాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాడానికి అనేక పథకాలు అమలు చేశారని అన్నారు. ఒక రైతు బిడ్డగా, చిన్నప్పటి నుంచి రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా తనను ఆశీర్వదించాలని కోరారు. రైతులకు అవసరమైన విద్యుత్, రైతుబంధు లాంటి పథకాలు అమలు చేయడంతో రైతు దేశంలోనే మందంజలో ఉన్నారని అన్నారు. కేసీఆర్ గడిచిన 10 సంవత్సరాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు దాదాపు 50 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారని గుర్త చేశారు. తెలంగాణ వాణిని పార్లమెంట్‌లో వినిపించాలంటే మరొక సారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీ నామా ప్రజలను కోరారు.

కేసీఆర్‌కు ఉద్యమ గుమ్మం ఘనస్వాగతం

ఖమ్మం, ఏప్రిల్ 29: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఉద్యమ గుమ్మం అయిన ఖమ్మం ప్రజలు ఘన స్వాగతం పలికారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి ఖమ్మం రోడ్ షో నిర్వహించిన కేసీఆర్‌కు గులాబీ సైన్యం సాదరంగా స్వాగతం పలికింది. నగరంలోని కాల్వొడ్డు వద్ద సీఎం కేసీఆర్‌కు నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం రూరల్ ఎంపీపీ బెల్లం ఉమ, పలువురు కార్పొరేటర్ల ఆధ్వర్యంలో కేసీఆర్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. కార్యకర్తలు గులాబీ జెండాలు చేతబూని, కేరళ కళాకారులు డప్పు వాయిద్యాలు మోగిస్తూ, డీజేలతో ఆడుతూ పాడుతూ కేసీఆర్ రోడ్ షోలో పాల్గొన్నారు. జై తెలంగాణ జైజై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలతో ఖమ్మం గుమ్మం దద్దరిల్లింది. కేసీఆర్‌కు అడుగడుగునా గులాబీ సైన్యంతో పాటు ప్రజలు చీమల దండులా కదిలివచ్చి నీరాజనం పలికారు.

ఖమ్మం లోక్‌సభ బరిలో 35 మంది..

ఆరుగురు ఉపసంహరణ, నలుగురి నామినేషన్లు తిరస్కరణ

నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న పోట్ల నాగేశ్వరరావు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29: ఖమ్మం లోక్‌సభ స్థానం ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు నిలిచారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు మధ్యాహ్నం 3 గంటల వరకు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. వారిలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసిన సోమగాని నరేందర్, మారం వెంకటరెడ్డి, తండు ఉపేందర్, లింగం కృష్ణ, ఓడిత్యా వినోద ఉపసంహరించుకున్న వారిలో ఉన్నారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా 45మంది అభ్యర్థులు 75సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 26వ తేదీన చేపట్టిన స్క్రూట్నీలో నలుగురి నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతోపాటు మొత్తం 16 సెట్ల నామినేషన్లు తిరస్కరించారు. మిగతా 41మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించారు. కాగా సోమవారం నామినేషన్ల ఉపసంహరణ తుది రోజున ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో ఖమ్మం పార్లమెంట్ బరిలో 35మంది ఉండగా, ఇందులో నలుగురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉన్నారు. మిగతా 31మంది అభ్యర్థులు వివిధ రిజిస్టర్ పార్టీల అభ్యర్థులతోపాటు ఏ పార్టీలతో సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎన్నికల పరిశీలకుడు సంజయ్

సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29: ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ పరిశీలకులు చరణ్‌జిత్‌సింగ్, వ్యయ పరిశీలకుడు అరుణ్ ప్రసాద్ కృష్ణసామి, శంకర ఆనంద్‌మిశ్రాతో కలిసి రాజకీయ పార్టీలు, పోటీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతిఒక్కరూ కచ్చితంగా పాటించాలన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు నిఘా పెట్టినట్లు తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో 1,896 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం 16,31,039 మంది ఓటర్లు ఉన్నట్లు, పోలింగ్ కేంద్రాల్లో మార్పులు ఉండవన్నారు. సి-విజిల్ యాప్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. అభ్యర్థులు ప్రతిరోజు ఖర్చు వివరాలు సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్, పార్లమెంట్ పోటీ అభ్యర్థులు, అధికారులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్ పూర్తి

లోకసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్‌ను సాధారణ పరిశీలకుడు సంజయ్ జి కోల్టే, కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం చేపట్టారు. 207 మంది మైక్రో అబ్జర్వర్స్‌లను అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. అభ్యర్థుల వ్యయ వివరాల మొదటి తనిఖీ మే 1న, రెండో తనిఖీ మే 6న, మూడో తనిఖీ మే 10వ తేదీన చేపడతారని తెలిపారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీపీ

రఘునాథపాలెం, ఏప్రిల్ 29 : లోక్‌సభ సాధారణ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఖమ్మం కమిషనరేట్ పరిధిలో సోషల్ మీడియా పోస్టులపై మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని ఖమ్మం సీపీ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్దేపూర్వకంగా రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

'మిస్ట్'లో మూడు రోజుల వర్క్‌షాప్

సత్తుపల్లి, ఏప్రిల్ 29: మండల పరిధిలోని కొత్తూరులోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 2, 3 సంవత్సరం విద్యార్థులకు డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై మూడు రోజుల పాటు వర్క్‌షాప్, హాకథాన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్, హాకథాన్‌లో మెంటర్ టి.దిలీప్ ఆధ్వర్యంలో 36 గంటల పాటు హాకథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఈసీ, ఏఐఎంఎల్ విభాగానికి చెందిన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించాలి

వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 29: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. వైద్య విధానపరిషత్ పరిధిలోని జిల్లాస్థాయి సీహెచ్‌సీల సూపరెంటెండెంట్లు, వైద్యులు, సిబ్బందితో తిరుమలాయపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వ ఆసుపత్రులను 100 బెడ్లకు విస్తరించి సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేసినట్లుగా వివరించారు. ఎన్నికల అనంతరం జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో మౌలిక వసతుల కల్పిస్తామని, వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపడతామని, పరికరాల సమకూర్చుతామని వివరించారు. తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో ఎక్స్‌రే యూనిట్, జనరేటర్, వంటగది, మార్చురీ తదితరాలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం తిరుమలాయపాలెం సీహెచ్‌సీని పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్లు వెంకటేశ్వర్లు, కృప ఉషాశ్రీ, మంగళ, రవికుమార్, రంజిత్, లవన్, బొల్లికొండ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు: డీఎఫ్‌వో

మధిర, ఏప్రిల్ 29: వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ స్పష్టం చేశారు. మధిర ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రిజర్వుడ్ ఫారెస్టులో కొందరు వేటగాళ్లు వలలతో అడవి జంతువులను వేటాడుతున్నారని అన్నారు. మధిర ఫారెస్టు రేంజ్‌లోని ఎర్రుపాలెం మండలం బీమవరం రిజర్వుడ్ ఫారెస్టు కాచారం వద్ద ఆదివారం అర్ధరాత్రి మార్త శ్రీనివాసరావు అనే వ్యక్తి అడవి పక్షి (కణుజు)ను పట్టుకొని దానిని హతమార్చాడని, దాని మాంసాన్ని విక్రయించాడని తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి.. అతడి ఇంటిపై దాడి చేసి రెండు కిలోల కణుజు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కాగా, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎస్.కొండారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో జార్ఖండ్ బృందం భేటీ

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29: జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవనశాఖల డైరెక్టర్ కుమార్ తారాచంద్ నేతృత్వంలోని బృందం రాష్ట్రంలో సాగు బాగు ప్రాజెక్ట్ అధ్యయన నిమిత్తం పర్యటిస్తున్నది. పర్యటనలో భాగంగా సోమవారం ఖమ్మం జిల్లాకు చేరుకున్న బృందం, కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన రంగంలో చేపడుతున్న చర్యలు, సాగు బాగు ప్రాజెక్ట్ అమలు గురించి బృందానికి కలెక్టర్ వివరించారు. జార్ఖండ్ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి, సలహాదారు ప్రదీప్‌కుమార్‌హజారే, రాష్ట్ర కార్యదర్శి ఓఎస్‌డీ అభినవ్ మిశ్రా, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, డిజిటల్ గ్రీన్ ప్రాజెక్ట్ మేనేజర్లు జ్యోతి, యశోద, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి క్రీడా శిబిరాలు

మధిర, ఏప్రిల్ 29: షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడల సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మధిర ఎంఈవో వై.ప్రభాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మధిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గ్రీన్‌ఫీల్డ్ ఇండోర్ స్టేడియంలో మే 1 నుంచి మే 30 వరకు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5:30 గంటల నుంచి 7 గంటల వరకు ఈ శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించే ఈ శిబిరాలు 15 ఏళ్ల లోపు బాలబాలికలకు మాత్రమేనని తెలిపారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఊరూరా నీరా'జనం'

ఖమ్మం రూరల్: ర్యాలీగా బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులు, మధిర: ఖమ్మం రోడ్‌షోకు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు, రఘునాథపాలెం: పాండురంగాపురం నుంచి..

- జిల్లా సరిహద్దులో ఘన స్వాగతం
- బస్సు యాత్రకు భారీగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు
- జై తెలంగాణ.. నినాదాలతో హోరెత్తిన వీధులు

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం వరంగల్ నుంచి వస్తున్న పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఖమ్మం జిల్లా సరిహద్దు అయిన తిరుమలాయపాలెం మండలంలో సమీప ప్రాంతాల ప్రజలు సోమవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. వరంగల్ – ఖమ్మం హైవే మీదుగా ప్రత్యేక బస్సులో వెళ్తున్న గులాబీ దళపతికి రహదారి పొడవునా ఊరూరా ప్రజలు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా అందరికీ నమస్కరిం చుకుంటూ, అభివాదం చేసుకుంటూ కేసీఆర్ ముందుకు సాగారు. మాదిరిపురం వద్ద పటాకులు కాల్చి, ప్రదర్శన చేసి వెల్‌కం చెప్పారు. కాగా, ఈ సందర్భంగా సుబ్లేడు క్రాస్ రోడ్డు వద్ద కేసీఆర్ వాహన శ్రేణిని పోలీసులు తనిఖీ చేశారు.

ఖమ్మం రూరల్ మండలంలో..

కాగా, ఖమ్మం రూరల్ మండలంలోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఘన స్వాగతం లభించింది. ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 28 గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు సొంత వాహనాలతో, కాలి నడకతో భారీ ప్రదర్శనంగా వచ్చి వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద గులాబీ దళపతికి ఎదురేగి స్వాగతం పలికారు.

కేసీఆర్‌ను చూడాలని.. ప్రసంగం వినాలని..!

రఘునాథపాలెం, ఏప్రిల్ 29 : ఉద్యమనేత, బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మంలో సోమవారం నిర్వహించిన బస్సుయాత్రకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. రోడ్ షోను విజయవంతం చేసేందుకు నగర పరిధిలోఅన్ని డివిజన్ల నుంచి పార్టీల నేతలు, కార్యకర్తలతో పెద్దసంఖ్యలో బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. కారు గుర్తుకే మన ఓటు అంటూ పెద్దఎత్తున కార్యకర్తలు చేసిన నినాదాలతో డివిజన్లు మారుమ్రోగాయి. ఖమ్మం నగరం పాండురంగాపురంలో డివిజన్ ఇన్‌చార్జిలు చిలుమూరి కోటి, యండీ ఫయాజ్, హెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. రఘునాథపాలెం మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేలాదిగా ఆటోలు ద్వారా కార్యకర్తలు, మహిళలు భారీగా తరలారు. కేసీఆర్‌ను చూడాలని.. ఆయన ప్రసంగాన్ని స్వయంగా వినాలనే ఆసక్తితో స్వచ్ఛందంగా పయనమై వెళ్లారు.

కేసీఆర్ రోడ్‌షోకు వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

కొణిజర్ల, ఏప్రిల్ 29: కేసీఆర్ ఖమ్మంలో జరిగిన రోడ్‌షోకు సోమవారం మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్త లు భారీగా తరలివెళ్లారు. మండలం నుంచి ద్విచక్ర వాహనా లు, కార్లు, ఇతర ప్రైవేటు వాహనాలు ర్యాలీగా బయల్దేరి వెళ్లా రు. జైకేసీఆర్.. జైజై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.

కేసీఆర్ రోడ్‌షోకు తరలిన 'మధిర' నేతలు

మధిర, ఏప్రిల్ 29: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం ఖమ్మంలో సోమవారం చేపట్టిన కేసీఆర్ రోడ్‌షోకు మధిర నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరారు.

తిరుమలాయపాలెం: కేసీఆర్ వాహన శ్రేణిని తనిఖీ చేస్తున్న పోలీసులు, మాదిరిపురం వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

తెలంగాణలో వ్యవసాయం అద్భుతం

జార్ఖండ్ అధికారులు

మాట్లాడుతున్న జార్ఖండ్ ఐఏఎస్ అధికారులు

కూసుమంచి, ఏప్రిల్ 29: తెలంగాణలో వ్యవసాయం అద్భుతంగా ఉందని జార్ఖండ్ ఐఏఎస్ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న 'సాగు బాగు' ప్రాజెక్టు ఎంతో మంచి ఫలితాలను ఇస్తోందని తాము తెలుసుకున్నామని, దానిని తమ రాష్ట్రంలోనూ ప్రవేశ పెడతామని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న 'సాగు బాగు' ప్రాజెక్టును పరిశీలించేందుకు కూసుమంచికి వచ్చిన జార్ఖండ్ ఐఏఎస్ అధికారులు.. ఇక్కడి రైతువేదికలో సోమవారం జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. 'సాగుబాగు' ప్రాజెక్టు కింద సాధించిన ఫలితాలు, రైతులకు అందిస్తున్న ఉపకరణాలు, పంటల మార్కెటింగ్‌కు చేపట్టిన చర్యల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. జార్ఖండ్ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు కుమార్ తారాచంద్, కుమార్ హాజారి, అభినవ్ మిశ్రా, జిల్లా అధికారులు విజయనిర్మల, విజయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నిబంధనలు పాటించాలి

రికార్డులు పరిశీలించేందుకు వచ్చిన ఎన్నికల పరిశీలకుడు చరణ్‌జిత్‌సింగ్

బోనకల్లు, ఏప్రిల్ 29: ఎన్నికల నిబంధనల ప్రకారం పోలీసు వ్యవస్థ పకడ్బందీగా విధులు నిర్వహించాలని, ఈసీ నిబ్బంధనలను కచ్చితంగా పాటించాలని ఖమ్మం పార్లమెంటు ఎన్నికల పోలీసు విభాగ పరిశీలకుడు చరణ్‌జిత్‌సింగ్ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు నమోదు చేస్తున్న కేసుల సమాచారాన్ని పరిశీలించేందుకు సోమవారం ఆయన బోనకల్లు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పోలీసుల విధులు, వారు నమోదు చేసిన కేసుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటి రికార్డులను పరిశీలించారు. ట్రైనీ ఐపీఎస్ అవినాశ్, మధిర సీఐ మధు, ఎస్సై మధుబాబు పాల్గొన్నారు.

వేసవి నృత్యశిక్షణ శిబిరం ప్రారంభం

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 29: పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో నవ్యమౌనిక డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి నృత్య శిక్షణా శిబిరాన్ని డాక్టర్ మట్టా దయానంద్ సోమవారం ప్రారంభించారు.

మనస్తాపంతో గర్భిణి ఆత్మహత్య

కూసుమంచి, ఏప్రిల్ 29: కుటుంబ పరిస్థితుల కారణంగా మనస్తాపానికి గురైన గర్భిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పాలేరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాలేరుకు చెందిన నూకల రంగారెడ్డితో సూర్యాపేట జిల్లా నడిగూడేనికి చెందిన తేజస్విని (24)తో మూడేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో మస్తాపానికి గురై ఆందోళనలో ఉన్న తేజస్విని శనివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించి వచ్చి చూసేసరికి మరణించి ఉంది. మృతురాలి తల్లి వర్ల పిచ్చమ్మ ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ప్రస్తుత గర్భిణిగా ఉన్న తేజస్వినికి ఏడాది వయసున్న పాప కూడా ఉంది. కూసుమంచి ఎస్సై కిరణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా నిందితుల అరెస్టు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29 : గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ ఉదయ్ కుమార్ తెలిపారు. రూ.8 లక్షల విలువైన 32కిలోల గంజాయి, రూ.5 వేల నగదు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. ఒడిస్సాకు చెందిన భరత్, పద్మతుల అలియానా 32కిలోల గంజాయిని విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు తీసుకెళ్లే క్రమంలో ఖమ్మంలో దిగి రైల్వేస్టేషన్ సమీపంలో రామాలయం వద్ద అనుమానాస్పదంగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అస్వస్థత

మామిళ్లగూడెం, ఏప్రిల్ 29 : ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఖమ్మం పోలీస్ కమిషనర్ పరిధిలోని ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నాగులు కానిస్టేబుల్ జడ్పీసెంటర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోవడంతో వెంటనే గుర్తించిన స్థానికులు, ట్రాఫిక్ సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్‌ను ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఎస్ఐ రవికుమార్ పరామర్శించారు.

రెండు ఇళ్లు దగ్ధం

పెనుబల్లి, ఏప్రిల్ 29: అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని మండాలపాడు గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాయం జగన్నాథానికి చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో పక్కనే వున్న మరో ఇల్లు కూడా దగ్ధమైంది. రెండు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. రెండు ఇళ్లల్లో కట్టుబట్టలతో సహా కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

అంకమ్మతల్లికి పూజలు చేసిన సండ్ర

వేంసూరు, ఏప్రిల్ 29: మండల పరిధిలోని వెంకటాపురంలో జరుగుతున్న అంకమ్మ తిరునాళ్ల మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-AII
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616